

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 10-04-2026 | సంపుటి - 27 | సంచిక -318 | రూ : 4 | పేజీలు: 8


## జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ సాదర ఆహ్వానం

- కేసీఆర్‌కు, జీవన్‌రెడ్డికి 40ఏండ్లకుపైగా స్నేహం : కేటీఆర్
- కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది : జీవన్‌రెడ్డి
- జగిత్యాలలో జీవన్‌రెడ్డితో కేటీఆర్ భేటీ
- 13 లేదా 27న కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకునే అవకాశం



2లో



## కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

- మూడు బ్యారేజీలను వినియోగంలోకి తేవాలి
- పనుల పర్యవేక్షణకు మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

2లో

## 60 ఏండ్లలో మీరు కట్టింది 25 రిజర్వాయర్లే..

- మేము 9 ఏండ్లలో 65 టీఎంసీలకు రిజర్వాయర్లు నిర్మించాం
- పాలమూరురంగారెడ్డి మేజర్ పనులన్నీ మేమే పూర్తి చేశాం..
- మిగిలిన పనులు చేయడం చేతకాలే..
- కమీషన్ల కోసం ప్రాజెక్టులు కడతారా..: ఏదుల బహిరంగ సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు
- గొల్లపల్లి – చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతుల దీక్ష విరమణ

2లో





## రాజీకొస్తారా..!

- కొనసాగుతున్న ఉద్రిక్తతలు..
- లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ దాడులు
- నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు
- ఏర్పాట్లు జరుగుతున్నాయి : పాకిస్తాన్
- ఒప్పందం కుదరకపోతే మళ్లీ దాడులు : ట్రంప్
- యుద్ధమా? కాల్పుల విరమణా? ట్రంప్ తేల్చుకోవాలి : ఇరాన్

2లో



## భూ రికార్డులకు బ్రేక్.. చంద్రబాబు కీలక ప్రకటన!



2లో

- సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 2027 మార్చి నాటికి 1.12 కోట్ల కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ లక్ష్యం
- భూ రికార్డుల భద్రతకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ, రికార్డ్ లాకింగ్ సిస్టమ్
- 22ఏ నిషేధిత జాబితా నుంచి 1.37 లక్షల ఎకరాల ఇనాం భూములకు విముక్తి
- ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా లబ్ధిదారుని ఇంటికే పంపాలని ఆదేశం



## బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది

- ఐదేళ్ల క్రితం నాటి నందిగ్రామ్ ఫలితమే ఇప్పుడు బెంగాల్ అంతటా వస్తుందన్న మోదీ
- బెంగాల్ అభివృద్ధికి, చరిత్ర తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్న ప్రధాని
- బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని వ్యాఖ్యలు

2లో

## సౌదీ కీలక ఆయిల్ పైప్‌లైన్‌పై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడి

- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కొన్ని గంటల్లోనే ఘటన
- హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గం కావడంతో పెరిగిన ఆందోళన
- అంతర్జాతీయ మార్కెట్లో మళ్లీ చమురు ధరలు పెరిగే అవకాశం

2లో





## పోలింగ్ ప్రశాంతం

- పుదుచ్చేరిలో 86శాతం..
- అసోంలో 84.42శాతం..
- కేరళలో 77.45శాతం
- అసోంలో ఘర్షణలు : 30మందికి గాయాలు, ఏడుగురు అరెస్టు
- అసోంలో పోలింగ్ బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

2లో

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

హైదరాబాద్ : కాళేశ్వరంలోని మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాజీకొస్తారా..!

వాషింగ్టన్/టెహ్రాన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు ఇస్లామాబాద్ వేదికగా శుక్రవారం జరగనున్నాయి. మరోపక్క లెబనాన్‌పై దాడులు కొనసాగుతున్నాయి. దీనిపై స్పష్టత వచ్చేవరకు హోర్ముజ్ జలసంధిని తెరిచేది లేదని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజమైన ఒప్పందం జరిగే వరకూ సైన్యం అక్కడే ఉంటుందని తెలిపారు. అయితే హిజ్బొల్లాను నిరాయుధీకరణ చేసేందుకు, ఇరు దేశాల మధ్య "శాంతి సంబంధాలను" నెలకొల్పేందుకు లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని తన మంత్రివర్గాన్ని ఆదేశించినట్టు ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. "ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష చర్చలు జరపాలని లెబనాన్ పదేపదే అభ్యర్థనలు చేస్తుంది. దీంతో వీలైనంత త్వరగా లెబనాన్‌తో ప్రత్యక్ష చర్చలు ప్రారంభించాలని నేను నిన్న క్యాబినెట్‌ను ఆదేశించాను" అని ఆయన కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'అమెరికా కాల్పుల విరమణ లేదా ఇజ్రాయిల్ ద్వారా యుద్ధాన్ని కొనసాగించడమా అనేది తేల్చుకోవాలి' అని అన్నారు. రెండూ సాధ్యం కాదు, లెబనాన్‌పై ఇజ్రాయిల్ మారణకాండను ప్రపంచం చూస్తుందని అరాగ్చీ సోషల్ మీడియా ఎక్స్‌లో గురువారం తెలిపారు. అలాగే ఈ దాడులు కొనసాగితే ఒప్పందం బలహీనపడి, ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదముందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. అయితే ఇజ్రాయిల్ బరితెగింపు తీవ్ర ప్రభావం చూపుతుందని అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఇరకాటంలో పాకిస్తాన్ ప్రధాని షరీఫ్..**

కాల్పుల విరమణలో కీలకంగా వ్యవహరించామని ప్రచారం చేసుకుంటున్న పాకిస్తాన్ ఇజ్రాయిల్ దాడులతో ఇరకాటంలో పడింది. ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించిన అనంతరం పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, తమ మిత్రదేశాలతో కలిసి, లెబనాన్, ఇతర ప్రాంతాలతో సహా అన్నిచోట్లా తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది." అని ప్రధాన మధ్యవర్తిగా వ్యవహరించిన ఆయన ఎక్స్‌లో తెలిపారు. అయితే దీనిపై అమెరికా, ఇజ్రాయిల్ భిన్నమైన వాదనలను వినిపిస్తున్నాయి. ఇస్లామాబాద్‌లో ఇరాన్‌తో శనివారం జరిగే చర్చలకు అమెరికా నుండి అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ హాజరు కానున్నారు. శుక్రవారం హంగరీలోని బుడాపెస్ట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, "యుద్ధ విరమణ ఒప్పందంలో లెబనాన్ కూడా ఉందని ఇరాన్ అనుకుంటుంది, కానీ అది నిజం కాదు" అని అన్నారు. దీంతో చర్చల్లో లెబనాన్‌పై దాడుల అంశం చేర్చాలా? వద్దా ? అనే సందిగ్ధం నెలకొంది. అంతేకాకుంగా పాక్‌లోని ఇరాన్ రాయబారి ఇస్లామాబాద్ చర్చలకు తమ దేశం నుంచి ప్రతినిధులు ఈ రాత్రికే చేరుకుంటారని ఎక్స్‌లో ప్రకటించి అనంతరం దాన్ని తొలగించారు. దీంతో అనేక చర్చలు జరుగుతాయా? లేదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

**ఖండించిన పలు దేశాలు.**

"లెబనాన్ సార్వభౌమత్వాన్ని, భద్రతను ఉల్లంఘించకూడదు. పౌరుల ప్రాణాలకు, ఆస్తులకు భద్రతకు హామీ ఇవ్వాలి," అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ తెలిపారు. సంయమనం పాటించాలని, "ప్రాంతీయ పరిస్థితిని చల్లార్చాలని" బీజింగ్ కోరుకుంటుందని ఆమె తెలిపారు. అలాగే రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో ఫోన్‌లో మాట్లాడారని. ఈ ఒప్పందాలకు ప్రాంతీయ కోణం ఉందని, ప్రత్యేకించి ఇవి లెబనాన్‌కు వర్తిస్తాయని మాస్కో గట్టిగా విశ్వసిస్తోందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్ దాడులపై యూరోపియన్ యూనియన్ అగ్రశ్రేణి దౌత్యవేత్త కాజా కల్లాస్ మాట్లాడుతూ, "ఇజ్రాయిల్ చర్యలు అమెరికాఇరాన్ కాల్పుల విరమణను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఇరాన్ కాల్పుల విరమణ లెబనాన్‌కు కూడా వర్తించాలి" అని అన్నారు. అలాగే బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి యెవెట్ కూపర్, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు "తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయని", అమెరికా ఇరాన్ కాల్పుల విరమణను అస్థిరపరిచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. "లెబనాన్‌ను కాల్పుల విరమణలో చేర్చాలని మేము కోరుకుంటున్నాము, లేకపోతే అది మొత్తం ప్రాంతాన్ని అస్థిరపరుస్తుంది" అని ఆమె అన్నారు. ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీన్‌నోయెల్ బారోట్, లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను "ఆమోదయోగ్యం కాదు" అని ఖండించారు. ఈ దాడులు అమెరికాఇరాన్ కాల్పుల విరమణను బలహీనపరుస్తాయని హెచ్చరించారు. మరోవైపు ఇజ్రాయిల్ సైన్యం బీరుట్‌లో హిజ్బుల్లా చీఫ్ నయీం ఖాస్సేంకు సన్నిహిత సలహాదారు, మేనల్లుడు అలీ యూసుఫ్ హర్షిని హతమార్చినట్టు ప్రకటించింది.

*** ఒప్పందం కుదిరే వరకు సైన్యం అక్కడే : ట్రంప్**

ఇరాన్‌కు సమీపంలో మోహరించిన అమెరికా బలగాలు "నిజమైన ఒప్పందం" కుదిరే వరకు అక్కడే ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ట్రంప్ "అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది, అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు, ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును నాశనం చేయడానికి అవసరమైన ప్రతిదీ, నిజమైన ఒప్పందం పూర్తిగా పాటించే వరకు ఇరాన్ లోపల, చుట్టూ మోహరించి ఉంటాయి" అని పేర్కొన్నారు. ఒప్పందం విఫలమయ్యే అవకాశం "చాలా తక్కువ" అని ఆయన చెప్పినప్పటికీ, ఒప్పందం కుదరకపోతే "పెద్ద, మెరుగైన, బలమైన" దాడులకు తిరిగి వెళ్తామని ట్రంప్ హెచ్చరించారు. "ఈలోగా మన గొప్ప సైన్యం లోడ్ అవుతోంది, విశ్రాంతి తీసుకుంటోంది, నిజానికి, దాని తదుపరి విజయం కోసం ఎదురుచూస్తోంది!" అని ఆయన వెల్లడించారు.

# 60 ఏండ్లలో మీరు కట్టింది 25 రిజర్వాయర్లే..

వనపర్తి : "రాజకీయాల కోసం ఏనాడూ రైతులు దీక్షలు చేయలేదు.. కేవలం తమకు న్యాయం జరగాలన్న కాంక్షతోనే దీక్షలకు పూనుకుంటారు.. మీ కమీషన్ల కోసం గొల్లపల్లి చీర్కపల్లి ప్రాజెక్టు కట్టడం సరికాదు.. 60ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టింది కేవలం 25 రిజర్వాయర్‌లే.. తొమ్మిది ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో మేము 65 టీఎంసీల రిజర్వాయర్‌లు నిర్మించాం. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ మేజర్ పార్ట్ మేమే పూర్తి చేశాం.. మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదు.." అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. వనపర్తి జల్లా ఏదుల మండలం గొల్లపల్లి - చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి వారితో దీక్ష విరమింపజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఒకరు జిల్లాను దత్తత తీసుకున్నానని చెబితే.. మరొకాయన వలసల జిల్లాను చేశారని విమర్శించారు. అన్ని నీళ్లు పాలమూరురంగారెడ్డి రిజర్వాయర్‌లో ఉంటే పాలమూరు ఎట్లా ఉండేదో ఆలోచించుకోవాలన్నారు. అనేక కేసులు వేసి ప్రాజెక్ట్ పనులకు అడ్డుకట్ట వేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని పాలిస్తున్నది నల్లమల పులి కాదని.. అది పిల్లి.. అని ఎద్దేవా చేశారు. కేఎల్ఐలో వనపర్తి నియోజకవర్గం లేదని.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒప్పించి వనపర్తికి నీళ్లు ఇప్పించారన్నారు. గొల్లపల్లి - చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం లేదని, ఏదుల నుంచి నీళ్లు పారుతాయని ఆనాడే తేల్చి చెప్పామన్నారు. మీ కమీషన్‌ల కక్కుర్తి కోసం ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయొద్దని కోరారు. మీ భూములు కాపాడుతామని రైతులకు భరోసానిచ్చారు. ఇక్కడ ప్రాజెక్టు కట్టకుండా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తామన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను జూరాల దగ్గర కట్టాల్సిందని అంటున్నారని, బుద్ధి వున్న ఎవరైనా అది సరైంది అంటారా? అని ప్రశ్నించారు. వలసలు వాపస్ అని బీఆర్ఎస్ హయాంలో వార్తలు వచ్చాయన్నారు. పాలమూరు పచ్చని రంగు వేసుకున్నదని పేపర్లో హెడ్డింగ్‌లు వచ్చాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండున్నర ఏండ్లలో పదివేల ఎకరాలకు నీళ్లు ఇచ్చినవా అని ప్రశ్నించారు. కానీ తెలంగాణ ఆరు గ్యారంటీలు అమలు చేశామని కేరళంకు వెళ్లి అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఇక్కడ ఏం చేయలేదుగానీ.. కేరళం వెళ్లి అన్నీ చేసేసాం అని చెప్పడమే గొప్పనా అని నిలదీశారు. ఈ సభలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, టిఆర్ఎస్ జిల్లా, ఏదుల రేవల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

# భూ రికార్డులకు బ్రేక్.. చంద్రబాబు కీలక ప్రకటన!

గుంటూరు, ఏప్రిల్ 09 : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, 2027 మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో గురువారం జరిగిన 'మీ భూమిమీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు కొత్త పాస్‌పుస్తకాలను అందజేసి, వారి సమక్షంలోనే భూ వివరాలను అధికారులతో చదివి వినిపించారు. అవినీతికి ఆస్కారం లేకుండా, ఆటో మ్యుటేషన్ తర్వాత పాస్‌బుక్‌ను నేరుగా యజమాని ఇంటికే పంపాలని అధికారులను ఆదేశించారు.

**భూ రికార్డులకు పటిష్ఠ భద్రత**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది ప్రజల భద్రత, జీవనాధారమని అన్నారు. భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు 'రీ సర్వే 2.0' చేపట్టామని, 2027 మార్చి నాటికి రాష్ట్రంలోని 16,816 గ్రామాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలకు కరెన్సీకి వాడే టెక్నాలజీనే వినియోగిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఎవరూ రికార్డులను తారుమారు చేయలేరని భరోసా ఇచ్చారు. "రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ విధానం తీసుకొచ్చాం. భూ యజమానులు తమ ఆధార్, ఈకేవైసీ ద్వారా భూ రికార్డులను లాక్ చేసుకునేందుకు 'రికార్డుల లాకర్ సిస్టమ్'ను అందుబాటులోకి తెచ్చాం. ఇది ప్రజల ఆస్తులకు రక్షణ కవచంగా ఉంటుంది. ప్రజల భూములకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే వివాదాస్పద ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

*** 22ఏ జాబితా ప్రక్షాళన, కీలక నిర్ణయాలు**

భూ యజమానులకు మేలు చేసే పలు కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నట్లు వెల్లడించారు. 2016కు ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీమ్‌లో పట్టా పొందిన సుమారు 75 లక్షల పేద కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పిస్తున్నామని, దీనివల్ల వారు తమ ఆస్తులను అమ్ముకునేందుకు, గిఫ్ట్‌గా ఇచ్చేందుకు వీలవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం 14 లక్షల ఎకరాల పట్టా భూములను అక్రమంగా 22ఏలో చేర్చిందని, ఆ జాబితాను పూర్తిగా సంస్కరిస్తున్నామని అన్నారు. సమస్యల సత్వర పరిష్కారానికి 22ఏపై కలెక్టర్ అధికారాలను జేసీ, ఆర్డీవోలకు బదలాయిస్తున్నట్లు ప్రకటించారు. వెబ్‌ల్యాండ్ తప్పులను సుమోటోగా సరిదిద్దే అధికారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్లకు ఇస్తామని చెప్పారు.

# పోలింగ్ ప్రశాంతం

న్యూఢిల్లీ : కేరళం, అసోం రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చెదురుమదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్లా భారీ సంఖ్యలోనే పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో 86శాతం, అసోంలో 84.42శాతం, కేరళలో 77.45శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అస్సాంలో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ముగిసినా, కేరళ, పుదుచ్చేరిల్లో మాత్రం ఆరుగంటల వరకు అనుమతించారు. ఆ సమయానికి క్యూలో వున్న వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు.

**కేరళలో**

కేరళలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సాఫీగా, సజావుగా సాగింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో అంతకంటే అధికంగానే నమోదైంది. ఈసారి కోయకోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, పలువురు మంత్రులు, నటులు సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారి ఓటు వేసిన వారు సెల్ఫీ దిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. కాగా తొలిసారి ఓటు వేసిన వారందరికీ ఎన్నికల కమిషన్ 'స్వీట్ సర్‌ప్రైజ్' ఇచ్చింది. ప్రతి జిల్లాలో మొదటసారి ఓటు వేసిన 200మందికి హల్వా పంచింది.

**ఎన్నికల అధికారి మృతి**

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఎన్నికల అధికారి దేబెన్ హోరో (45) మరణించి వుండగా కనుగొన్నారు. ఆయన మరణానికి కారణమేంటో ఇంకా నిర్ధారించలేదు. నాదార్ నియోజకవర్గంలో రెండో పోలింగ్ అధికారిగా ఆయనను నియమించారు. గురువారం ఉదయం ఆయన మంచంపై స్పృహ లేకుండా పడి వుండగా చూశారు. వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని అధికారులు తెలిపారు.

# బెంగాల్‌లో బీజేపీ అద్భుత విజయం సాధిస్తుంది

హల్దియా, ఏప్రిల్ 09: బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, బీజేపీ అద్భుత విజయం సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. హల్దియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని గుర్తు చేశారు. ఈసారి రాష్ట్రమంతా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఇప్పుడు భవానీపూర్‌లో (మమతా బెనర్జీ పోటీ చేస్తున్నారు) కూడా అదే ఫలితం వస్తుందని అన్నారు. ఈ ఎన్నికలు బెంగాల్ అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఉపయోగపడే ఎన్నికలు అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధి విషయంలో అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు రంగాల్లో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ మోసాలు ప్రజల ముందు ఉంచుతామని మోదీ పేర్కొన్నారు. బెంగాల్ యువతను తృణమూల్ కాంగ్రెస్ ఎంతో మోసం చేసిందని, ఆ పాపాలు ఊరికే పోవని హెచ్చరించారు. బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ రాగానే కేంద్ర పథకాలు ఇక్కడ అమల్లోకి వస్తాయని హామీ ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలు, కుంభకోణాలపై విచారణ జరిపి, కారకులైన వారిని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. శరణార్థులకు ఆశ్రయమిస్తామని, కానీ చొరబాటుదారులను తరిమికొడతామని స్పష్టం చేశారు.

# సౌదీ కీలక ఆయిల్ పైప్‌లైన్‌పై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడి

వాషింగ్టన్/రియాద్, ఏప్రిల్ 9 : అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇరాన్ మళ్లీ తన దూకుడు ప్రదర్శించింది. సౌదీ అరేబియాలోని అత్యంత కీలకమైన ముడి చమురు పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు, క్షిపణులతో దాడికి పాల్పడింది. ఈ ఘటనతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రంలోని యన్‌బు ఓడరేవుకు చమురును రవాణా చేసే ఈ 'ఈస్ట్‌వెస్ట్' పైప్‌లైన్ సౌదీకి అత్యంత వ్యూహాత్మకమైనది. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం, వివాదాస్పద హర్మూజ్ జలసంధిని దాటకుండా చమురు ఎగుమతి చేసేందుకు సౌదీకి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయం. యన్‌బు ప్రాంతంలోని పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిపినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ప్రకటించింది. ఈ ఘటనలో ఒక పంపింగ్ స్టేషన్ వద్ద మంటలు చెలరేగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించి, చమురు సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన వెంటనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. రోజుకు 70 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా సామర్థ్యం ఉన్న ఈ పైప్‌లైన్ దెబ్బతినడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మరోసారి ఆకాశాన్నంటే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ సాదర ఆహ్వానం

జగిత్యాల టౌన్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలకపరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి సాదర స్వాగతం పలుకుతున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డితో గురువారం జగిత్యాలలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. నాయకులు ఎల్.రమణ, కె.విద్యాసాగర్‌రావు, కొప్పుల ఈశ్వర్, కె.సంజయ్ కుమార్, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి వెళ్లిన కేటీఆర్ జీవన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు.

*** జిల్లాలో ఘన స్వాగతం.. భారీ బైక్ ర్యాలీ**

కేటీఆర్ జగిత్యాల రాకను పురస్కరించుకుని బీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశాయి. జగిత్యాల శివారులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి వందలాది బైకులతో భారీ ర్యాలీగా జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఇప్పటికే కేటీఆర్ ఆయనతో ఫోన్‌లో చర్చలు జరపగా, ప్రత్యక్షంగా భేటీ అయ్యి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్‌రెడ్డి మధ్య 40ఏండ్లకు పైగా స్నేహం ఉందన్నారు. 2014కు ముందు కూడా పార్టీలోకి ఆహ్వానించామని, ఇప్పుడు మరోసారి ఆహ్వానించామని తెలిపారు. రెండ్రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలుస్తానని జీవన్‌రెడ్డి చెప్పారని అన్నారు.

**27నెలలు క్షోభ : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి**

27నెలలుగా చాలా క్షోభ అనుభవించానని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఇప్పుడు కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని, బీఆర్ఎస్‌తో పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడొచ్చని అన్నారు.

# ఖమ్మంలో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఖమ్మం 40 వ డివిజన్ లో ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ,40వ డివిజన్ కార్పొరేటవర్ దాదే అమృత సతీష్ , మాజీ కార్పొరేటర్ దాదే ధనలక్ష్మి, ఖమ్మం నగర సెక్రెటరీ అజీమ్,ఆర్పీ నగర దీపిక పాల్గొన్నారు. ఈ కార్యకమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ 40 వ డివిజన్ లో ప్రతి మహిళ ఈ అవకాశని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి 40 వ డివిజన్ మహిళలు ఆధార కార్డ్ జిరాక్స్ లతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎఫ్ఆర్ఎస్ నమోదులో ఖమ్మం జోరు

* **రాష్ట్రంలోనే నెంబర్ వన్**



ఖమ్మం జిల్లా, ప్రజాస్ఫూర్తి : డిజిటల్ హాజరు ఎఫ్ ఆర్ఎస్ నమోదులో ఖమ్మం జిల్లా 80.88 శాతంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది . పెనుబల్లి మండలం 92.68 శాతంతో జిల్లాలో టాప్ లో ఉంది ఈ విదానం వల్ల మద్యాహ్నం భోజన బిల్లుల్లో అక్రమాలకు చెక్ పడిందని , అధికారుల సమిష్టి కృషితో ఈ ఘనత సాధ్యమమైందని డీఈవో చైతన్య జైని పేర్కొన్నారు .

# మంత్రి దామోదరను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు



అందోలు, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహను జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ గురువారం హైద్రాబాద్‌లోని మినిష్టర్స్ క్వార్టర్స్‌లో కలిసారు. శుక్రవారం జోగిపేటలోని సిద్దివినాయక టౌన్‌షిప్‌లో జరిగే శ్రీ గురుపాదుకా పూజా మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రంతో పాటు టీటీడీ ప్రసాదాన్ని మంత్రికి అందజేసారు. ఈ కార్యక్రమంలో మాధవానందస్వామి పాదుకా పూజా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మంత్రి దామోదర్‌ను శాలువాతో సత్కరించారు. ఏప్రిల్ నెలాఖరులో సిద్దివినాయక వెంచర్‌లో జరిగే కార్యక్రమానికి హజరుకావాలని చిట్టిబాబు మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# మౌలాలి ప్రగతి నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



మల్కాజిగిరి :ప్రజాస్ఫూర్తి : గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యలను గుర్తించిన ఆయన, స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చొరవ తీసుకుని పనులు ప్రారంభించారు. గురువారం జు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే దర్బంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్, సీనియర్ నాయకులు వెంకన్న, ఫెడరేషన్ అధ్యక్షుడు చింకు శీనన్న, ఫరూక్, ఎల్లం, మంద భాస్కర్, అజయ్, ప్రేమకుమార్, నర్సింగ్ రావు, బీమ్ రావు, జగదీష్, సయ్యద్, పాండురంగ చారి, షకీల్, యాకుబ్ , కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ఆలయ చైర్మన్ యాదయ్య, సెక్రటరీ అంజయ్య, మోహన్ రెడ్డి, శంకర్, శివరామకృష్ణ, అశోక్ రెడ్డి, వర్మ, రవి, రామ్ కోటీశ్వర్ రావు, సాంబశివరావు, నిశాంత్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయాలి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతోపాటు కాంగ్రెస్ పార్టీని వార్డు స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సంస్థాగతంగా నిర్మాణం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పార్టీ నేతలు నిర్ణయించారు. బుధవారం కొత్తగూడెంలోని ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం డిసిసి అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ కిరణ్ మిత్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, తదితరులు పాల్గొన్నారు. పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాలతో ఇచ్చిన ఆరు అంశాలతో కూడిన అజెండాపై సుదీర్ఘంగా చర్చించి పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

# కుత్బుల్లాపూర్‌లో అగ్ని ప్రమాదం



* **జీడిమెట్ల, దుండిగల్ పరిధిలో చెలరేగిన మంటలు**
* **భయాందోళనలో స్థానికులు**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన గోదాములు, స్క్రాప్ కేంద్రాలు అగ్నిగుండాలుగా మారుతున్నాయి. ఒకేరోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో సంభవించిన ఈ ప్రమాదాలు స్థానిక యంత్రాంగం వైఫల్యాన్ని ఎండగడుతున్నాయి. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్ నగర్ కేకే సొసైటీ, గంపల బస్తీ సమీపంలో ఉన్న ఒక స్క్రాప్ గోదాములో గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంబవించింది. భారీ స్థాయిలో నిల్వ ఉంచిన కెమికల్ డ్రమ్ములు, వేస్ట్ కెమికల్ పదార్థాలతో నిండిన స్క్రాప్ గోదాము. మంటల ధాటికి కెమికల్ డ్రమ్ములు పేలుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. పక్కనే నివాస ప్రాంతాలు ఉండటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే జీడిమెట్ల ఫైర్ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. పక్కనే ఉన్న ఇతర గోదాములకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**మరో ఘటనలో..**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాహదూర్ పల్లి గ్రీన్ హిల్స్ సమీపంలో ఉదయ గిరి నగర్ లో ఉన్న ఒక టెంట్ హౌస్ గోదాములో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో మంటలు గోదాము అంతా వ్యాపించి లోపల ఉన్న సామాగ్రి పూర్తిగా కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. రెండు చోట్ల జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

* **అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం!**

కుత్బుల్లాపూర్ ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్ కావడంతో ఇక్కడ స్క్రాప్, కెమికల్ గోదాములు విచ్చలవిడిగా వెలిశాయి. ప్రతి ఏటా వేసవిలో ఇక్కడ అగ్నిప్రమాదాలు జరగడం ఆనవాయితీగా మారింది. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న గోదాముల నుండి అధికారులు నెలవారీ మామూళ్లు వసూలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని, భద్రతా ప్రమాణాలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. జనావాసాల మధ్య కెమికల్ గోదాములకు అనుమతులు ఎలా ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపార నిర్వాహకులకు అగ్ని ప్రమాదాల నివారణపై కనీస అవగాహన కల్పించడంలో జీడిమెట్ల అగ్నిమాపక అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.ప్రమాదం జరిగినప్పుడు హడావిడి చేయడం తప్ప, శాశ్వత నివారణ చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిబంధనలు అతిక్రమించిన గోదాములపై కఠిన చర్యలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల మధ్య ఉన్న ప్రమాదకర స్క్రాప్ కేంద్రాలను తక్షణమే తరలించాలని కుత్బుల్లాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



# ఆర్టిజన్స్ ను తక్షణమే కన్వర్షన్ చేయాలి

* **ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ ను తక్షణమే కన్వర్షన్ చేయాలని, సమ్మె చేస్తున్న కార్మికులను చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె రెండో రోజుగురువారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొని సంగీభావం తెలిపి మాట్లాడుతూ రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిసన్స్ సమ్మె చేస్తున్న ప్రభుత్వం చర్చలకు పిలువకపోవడం విచారకరమనీ అన్నారు. ఆర్టిజన్ లను విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్ మెన్ లు గా డిప్లొమా వారికి సబ్ ఇంజనీర్లుగా ఆఫీస్ సబార్డినేటర్ లుగా జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో జీవనాన్ని గడుపుతున్నారని కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పించేలా కన్వర్షన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు .ప్రభుత్వం వెంటనే విద్యుత్ కార్మికులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించి సమ్మె ను నివారించాలని కోరారు.ఈ రెండవ రోజు సమ్మెలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీర స్వామి జెఏసి జిల్లా చైర్మన్ జిట్టబోయిన లింగస్వామి, జిల్లా నాయకులు గుండ లింగారెడ్డి పెరిక శేఖర్ వేణుగోపాల్ రెడ్డి పెరమళ్ళ మురళి,అద్దంకి వెంకన్న లతీఫ్ విజయ్ ఉమాదేవి నాగమణి రమ్య సతీషు ప్రవీణ్, రమేష్, నరసింహ ,పవన్ మల్లయ్య, వెంకన్న , ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం నందం జిల్లా నాయకులు బాసాని వెంకటయ్య ,సర్దార్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సత్యసాయి చలివేంద్రం ప్రారంభం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్య సాయి సేవ సమితి నల్లగొండ వారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక హైదరాబాద్ రోడ్డు తిరుమల టాకీస్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆ డివిజన్ కార్పొరేటర్ నవీన్ కుమార్, ఎంఆర్ఎఫ్ టైర్స్ డీలర్ యాదగిరి,ఆపిల్ కంప్యూటర్ అధినేత వెంకటరెడ్డి, సత్యసాయి సేవా సమితి నల్గొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్లు, కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే బాటసారులకు ప్రయాణికులకు వాహనదారులకు చల్లటి మంచినీరు మజ్జిగ అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ నగరపాలక సంస్థ 30 వ డివిజన్ కార్పొరేటర్ నవీన్ కుమార్ , ఎంఆర్ఎఫ్ టైర్స్ డీలర్ యాదగిరి, ఆపిల్ కంప్యూటర్ అధినేత వెంకట్ రెడ్డి, సత్య సాయి సేవా సమితి నలగొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ ,సాయి భక్తులు కొరివి తుకారాం, కె. కృష్ణ బాబు, జే.సందీప్ రెడ్డి, కె. శ్రీనివాస్, జగదీష్, నరసింహ, బి. శివ కుమార్, జీ.బాలరాజు, మహిళా సేవాదల్ సభ్యులు ముషం శోభ, ఇడుకుళ్ళ రాజ్యలక్ష్మి, కంచర్ల విజయ రెడ్డి , యూ.దేవీ, కవిత, రాజేశ్వరి, భాగ్య, సాయి భక్తులు గోవిందు బాలరాజు,కొరివి తుకారాం,కృష్ణ బాబు, సందీప్ రెడ్డి, కే శ్రీనివాస్, జగదీష్, నరసింహ, శివకుమార్, ముషం శోభ,ఇడుకుల రాజ్యలక్ష్మి, కంచర్ల విజయ రెడ్డి,యు దేవి, కవిత రాజేశ్వరి, భాగ్య తదితరులు పాల్గొన్నారు

# మల్కాజిగిరిలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠిన చర్యలు

* **ప్రత్యేక డ్రైవ్ విజయవంతం**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని మల్కాజిగిరి ఎక్స్ రోడ్ నుండి ఆనందబాగ్ వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్‌ను ఈరోజు నిర్వహించారు. లా & ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం క్రమబద్ధంగా కొనసాగింది. పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను గుర్తించి, ఎలాంటి రాజీ లేకుండా తొలగించడం జరిగింది. ప్రజల భద్రతను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని చట్టపరమైన విధానాల ప్రకారం చర్యలు తీసుకున్నారు.ఇకపై కూడా ఫుట్‌పాత్‌లపై అక్రమ ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. నగర శుభ్రత, ట్రాఫిక్ సౌకర్యం మరియు ప్రజల సౌలభ్యం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆసుపత్రికి ఫ్రిడ్జ్ విరాళంగా అందించిన లయన్స్ క్లబ్



ప్రజా స్ఫూర్తి, కొత్తగూడెం : లైయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం ఆధ్వర్యంలో రామవరం 14 నెంబర్ బస్తీలోని ప్రభుత్వ ఆసుపత్రికి గురువారం ఫ్రిడ్జ్‌ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ బొక్క శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆసుపత్రులకు అవసరమైన పరికరాలను అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పగడాల నగేష్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ డి. బాబురావు, రీజన్ చైర్‌పర్సన్ సాతులూరి సత్యనారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ బి. సక్ర, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఎం. రాజేశ్వర్ రావు, టి. శరత్ బాబు, డాక్టర్ రాము, హెడ్ నర్స్ ఎస్.ఎం.టి. శంకరమ్మ, కార్పొరేటర్ హిమశ్రీ, కంచర్ల జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్.. నిరుపేదల పాలిట వరం

* **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యాలకు గురై ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన జంగం సత్తమ్మ, ముటుకులోజు శ్రీనివాస చారిలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఉబ్బు వెంకటయ్య, గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మాలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య, జువ్వి నర్సింహ్మాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే చెల్లిందన్నారు. దశాబ్ద కాలానికి పైగా రేషన్ కార్డు లేక ఇబ్బంది పడిన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు నిరంతరంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ సొంతమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యుడు ఊదరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐతరాజు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రామవరం 6 డివిజన్లలో తాగునీటి సమస్య తీవ్రం

* **కిన్నెరసాని ట్యాంక్‌కు కొత్త మోటార్లు అవసరం: కార్పొరేటర్ సుప్రియ**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఆరు డివిజన్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ తెలిపారు. గురువారం రామవరం నాగయ్యగడ్డలో ఉన్న కిన్నెరసాని వాటర్ ట్యాంక్‌ను ఆమె పరిశీలించారు. ట్యాంక్‌లో 15 హెచ్‌పీ మోటారు ఉన్నప్పటికీ తరచూ మరమ్మతులకు గురవుతోందని, దాని స్థానంలో 25 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేయడంతో పాటు అదనంగా మరో మోటార్‌ను కూడా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు. తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.రామవరం ప్రాంతంలో కిన్నెరసాని సంబంధిత ఫిల్టర్ బెడ్, సంప్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ సమస్యను జిల్లా మంత్రి, ఎంపీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.అలాగే, నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌కు నూతన సాంకేతికతతో కూడిన మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కాలం కారణంగా నీటి కొరత మరింత పెరిగిందని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కిన్నెరసాని, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

# శివకుమార్‌కు బీఆర్ఎస్ సహాయం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ పట్టణం 20వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజమోని శివకుమార్ నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం అవసరమైన సహాయం విషయాన్ని కౌన్సిలర్ పిన్నమోని గోపాల్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్సీ వాణి దేవి సహకారంతో రూ. ఒక లక్ష ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేగూరి వేణుగోపాల్ లబ్ధిదారుడికి ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చీపిరి రవి యాదవ్, కౌన్సిలర్లు పిల్లి శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, ఎస్పీ శివ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ నోట్లతో మోసం చేస్తున్న విదేశీయుని అరెస్ట్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి :నకిలీ కరెన్సీ నోట్లతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న విదేశీ నిందితుడిని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. గురువారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిప్పర్తి మండల పరిధిలో నకిలీ రూ 500 రూపాయల నోట్ల ఆకారంలో ఉన్న కాగితాల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న గోయిత సౌంగలో అనే విదేశీ నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని మరొక ఎ వన్ నిందితుడు సల్మాన్ పరారీలో ఉన్నాడని వెల్లడించారు. నిందితుడు సుమారు రెండు సంవత్సరాల క్రితం పశ్చిమ ఆఫ్రికాలోని మాలి దేశం నుండి భారతదేశానికి వచ్చి, కొంతకాలం బెంగళూరులో నివసిస్తూ ఆఫ్రికన్ పండ్లు, ఇతర వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగించాడని తెలిపారు. అనంతరం కొంతమంది విదేశీయులతో కలిసి వాట్సాప్ గ్రూప్ ద్వారా పరిచయాలు పెంచుకుని, వీరు జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ కరెన్సీ నోట్ల పేరుతో మోసాలకు పాల్పడే కుట్ర పన్నారని వివరించారు.నిందితులు వారి పథకంలో బాగంగా ముందుగా అమాయక వ్యక్తులను వాట్సాప్ ద్వారా సంప్రదించి, ఒక లక్ష రూపాయల అసలు కరెన్సీకి బదులుగా ఐదు లక్షల రూపాయల విలువ గల 500 రూపాయల నోట్లను ఇస్తామని నమ్మబలుకుతు బాధితుడు నమ్మకపోతే, నల్లటి రంగు పూసిన 500 రూపాయల నోట్ ప్రత్యేక రసాయనంతో కడిగి నిజమైన నోటుగా మారినట్లు ప్రదర్శన చూపించి మోసం చేస్తారని అన్నారు. ఈనెల 6 న తిప్పర్తి మండలం మల్లేపల్లి వారిగూడెం దాబా వద్ద వంగూరి జానయ్య అనే వ్యక్తిని నిందితుడు మోసం చేసి రూ 1 లక్ష అసలు కరెన్సీ తీసుకుని, 5 లక్షల విలువ గల నోట్ల కట్టగా నమ్మబలికి, పైభాగంలో నాలుగు ఒరిజినల్ 500 నోట్లు చూపించి మిగతా భాగంలో నల్లటి కాగితాలను ఇచ్చాడని తెలిపారు. బాధితుడు ఇంటికి వెళ్లి ఆ కట్టను నిందితుడు ఇచ్చిన రసాయనంతో కడిగి చూడగా దానిలో ఎటువంటి మార్పు లేకపోవడం తో తాను మోసపోయినట్లు తెలుసుకున్నాడన్నారు.తరువాత తన స్నేహితుడు నకరెకంటి అంబేద్కర్ అలియాస్ అభిరామ్ సహాయంతో నిందితుడిని మళ్లీ సంప్రదించి, 2 లక్షలు ఇస్తామని చెప్పి 10 లక్షల విలువ గల నోట్లు కావాలని అడిగా ఈ క్రమంలో ఈనెల 9 న మధ్యాహ్నం 12:30 గంటలకు తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చిన నిందితుడు గోయిత సౌంగలో ను బాధితుడు, అతని స్నేహితుడు పట్టుకుని పోలీసులకు అప్పగించారని తెలిపారు. నిందితుడి వద్ద నుండి .నాలుగు కట్టల బ్లాక్ కలర్ రూ 500 నోట్ల సైజు కాగితాలు,ఒక రసాయన ద్రావణం,పౌడర్. ఒక రెడీమి కంపెనీ మొబైల్ ఫోన్నా,లుగు ఒరిజినల్ రూ 500 రూపాయల నోట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గతంలో కూడా అతనిపైన కేసులు నమోదు అయ్యాయని ఈ తరహా నకిలీ కరెన్సీ నోట్ల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా లావాదేవీల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా పోలీసులు సూచించారు. అనంతరం ఈ కేసును త్వరితగతిన ఛేదించినందుకు గాను నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, శాలిగౌరారం సి.ఐ కొండల్ రెడ్డి, తిప్పర్తి ఎస్.ఐ వి. శంకర్ వారి సిబ్బందిని జిల్లా ఎస్పి అభినందించారు.

## విద్యుత్ ఆర్టిసన్ల సమ్మె ఉధృతం

* సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం వద్ద వినూత్న నిరసన
* బోనాలు, వనభోజనాలతో ఐక్యత ప్రదర్శన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ ఆర్టిసన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజుకు చేరింది. గురువారం సైనిక్‌పురి డివిజన్ కార్యాలయ పరిధిలోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ, అక్కడే వనభోజనాలు నిర్వహిస్తూ తమ ఐక్యతను చాటుకున్నారు. డివిజన్ పరిధిలోని వివిధ సెక్షన్ల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకున్న కార్మికులు నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. సంస్థ కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డిమాండ్లు నెరవేరే వరకు విధులకు హాజరుకావడం లేదని స్పష్టం చేశారు.హబ్సిగూడ సర్కిల్ జాక్ చైర్మన్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో క్రిస్టోఫర్, జానయ్య, మల్లారెడ్డి, పైసా రవి, మోహన్ రావు, జానీ, ప్రసాద్, జమాల్, నరేష్ గౌడ్, విజయ్, కృష్ణ, రమేష్, రాజు, వెంకటేష్, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు. మహిళా కార్మికులు సుగుణ, లక్ష్మి, మమత, విజయ బోనాలతో నిరసనలో పాల్గొన్నారు.సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక నాయకులు స్పష్టం చేశారు.

## చెత్త తొలగింపు లేకపోవడంతో పాముల బెడద

* పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పద్మశాలి కాలనీలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. చెత్త చెదారం సమయానికి తొలగించకపోవడంతో పాములు జనావాసాల్లోకి చేరి ఇండ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇండ్లలోకి పాములు ప్రవేశిస్తుండడంతో కాలనీవాసులు తీవ్రమైన భయాందోళనలకు గురి అవుతున్నారు. ఈ సమస్యపై స్థానిక కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ పలుమార్లు మున్సిపల్ సానిటైజేషన్ అధికారులకు చెత్త తొలగింపు కోసం విన్నవించినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇకనైనా మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకొని ప్రజాసమస్యలను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : విద్యా అర్హతల ఆధారంగా ఆర్టిజన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రెండవ రోజు ఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని డివిజన్ ఆఫీస్ ల ఎదుట విద్యుత్ ఆర్టిజన్,అన్ మ్యాన్డ్ , పీస్ రేటు కార్మికుల సమస్యల సాధనకై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్టిజన్లకు ఎపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్, టీజీఎస్పీడిసీఎల్ లలో అన్ మ్యాన్డ్ వర్కర్లను ఆర్టిజన్లుగా విలీనం చేసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థలో 2016 డిసెంబర్ 4 వ తేదీ కంటే ముందు అన్ని అర్హతలు ఉండి పనిచేస్తూ ఇప్పటికీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగుతున్న వారిని ఆర్టిజన్ గా గుర్తించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న పీస్ రేట్ కార్మికులకు జీఓ నంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలన్నారు. 2026 పీ ఆర్ సీ (పీఆర్సీవేతన సవరణ) అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జేఏసీ నాయకులు సయ్యద్ అలీ , హరి, శర్మ, శేఖర్, మధు, మేడ్చల్ డివిజన్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌లపై అక్రమ ఆక్రమణలు పాల్పడితే చర్యలు తప్పవు

* గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ఫుట్ పాత్‌లపై అక్రమ ఆక్రమణలు పాల్పడితే చర్యలు తప్పవని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ అన్నారు. గురువారం సర్కిల్ పరిధిలోని షాపూర్ నగర్ నుండి సూరారం వరకు ఉన్న రహదారిపై అక్రమంగా వెలసిన ఆక్రమణలను గాజులరామారం సర్కిల్ అధికారులు తొలగించారు. సిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో రహదారులపై అక్రమ ఆక్రమణలు చేసినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సూరారం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న గ్రానైట్ , మార్బుల్ షాప్ యజమాని ఫుట్ పాత్ ఆక్రమణ చేసినందుకు రూ. 25,000 జరిమానా విధించి, ఆ జరిమానాను వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఏసీపీ సుమిత్ర, టీపీఎస్ మచేందర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, లా అండ్ ఆర్డర్ సిబ్బంది పాల్గొన్నారు.

**జీడిమెట్ల సర్కిల్ పరిధిలో....**

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని ప్రసూన నగర్, నందిని మెడికల్ షాప్, శ్రీనివాస్ నగర్, కాకతీయ నగర్, దుర్గా ఎస్టేట్ 3 టెంపల్ , వేంకటేశ్వర టెంపల్ దండమూడి ఎంక్లేవ్ లో ఉన్న రహదారిపై అక్రమ ఆక్రమణలను సిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించారు. ఉప కమిషనర్ డి శంకర్ సింగ్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో రహదారులపై అక్రమ ఆక్రమణలు చేసినచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఏసీపీ జీషన్, టీపీఎస్ మచేందర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామవరానికి యుద్ధ ప్రాతిపదికన మంచినీరు అందించాలి

: **సాబీర్‌పాషా**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మంచినీరు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా అధికారులను కోరారు. గురువారం రామవరంలోని కిన్నెరసాని, భగీరథ పనుల పైప్ లైన్లు, నూతన ట్యాంకులను సిపిఐ ప్రతినిధి బృందంతో కలిసి పరిశీలించిన అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రూ.125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించారని, అధికారుల అలసత్వం వల్ల పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా సాయంత్రానికి నీళ్లు అందించాలని కోరారు. స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకొని మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, 14,16,17వ డివిజన్ కార్పొరేటర్లు సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, సీనియర్ నాయకులు మాటేటి గోపాల్, సర్పంచ్ నగేష్, రమేష్, అంకుష్ గంటాడి కోటేశ్వరరావు, ఖంపెల్లి దుర్గయ్య, నాగరాజు, శివ, రాజు, జగ్గు, చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి సమాచారం తెలిపిన వారికి బహుమతి

* **8712656999 కు సమాయారం అందించాలి :ఎస్పీ డా. శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ యువత ఆరోగ్యం, భద్రత, భవిష్యత్తును కాపాడటానికి గంజాయి వినియోగం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడానికి కట్టుబడి ఉంది. డ్రగ్స్ దుర్వినియోగం ఒక తీవ్రమైన సామాజిక సమస్య. ఇది నిశ్శబ్దంగా యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలను బలహీనపరుస్తుంది. వ్యక్తులను నేరాల వైపు నడిపిస్తుంది. జిల్లా ప్రజలకు సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యాలలో ఒకటి.గంజాయి లాంటి మహమ్మారి నుండి మన ఉరిని, యువత భవిష్యత్తుని కాపాడేందుకు గంజాయి వినియోగం లాంటి కార్యకలాపాలను గుర్తించి పూర్తిగా అరికట్టడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం. బాధ్యత గల పౌరులు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించగలరు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలందరినీ గంజాయి వినియోగదారులు లేదా సరఫరా చేసే వ్యక్తుల గురించి విశ్వసనీయ సమాచారం అందించాలని కోరుతోంది. పోలీసులకు చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడే సమాచారాన్ని అందించిన వారికి ₹5,000 వరకు బహుమతి ఇవ్వబడుతుంది. సమాచారం ఇచ్చే వ్యక్తి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. సమాచారం ఈ ఫోన్ నెంబర్ 8712656999 తెలుపగలరు.

## ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలు






ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాల 25 సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కొత్తగూడెం క్లబ్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలను కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు హాజరై విద్యారంగంలో చేసిన సేవలను గుర్తు చేశారు. విద్యార్థులు లక్ష్యాయన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగితే విజయాలు తలుపు తడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయీమ్ పాషా మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రతి విద్యా సంవత్సరంలో గోల్డ్ మెడల్స్ సాధించడమే కాకుండా క్రీడల్లో నైపుణ్యాన్ని కనబరుస్తున్నారు అని చెప్పారు. డైరెక్టర్ శ్రీరాముని చలపతిరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించి మారుతున్న సమాజానికి అనుగుణంగా జీవించాలని కోరారు. ఈ వేడుకలలో ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్ లక్ష్మీ శ్రావణి శ్రీనివాస్ పాల్గొని కార్యక్రమం ఆద్యంతం తమ పాటలతో విద్యార్థులను ఉత్సాహపరుస్తూ వేడుకలకు మరింత శోభ తెచ్చారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహ పరిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ టాపర్స్‌కి ముఖ్య అతిథుల చేతులు మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పిడి కాసిమల్ల రమేష్, అధ్యాపకులు భద్రు, రఫీ, వేణు, శ్రీనివాస్, మాధురి, భారతి, జ్యోతి, ప్రగతి, జహేద, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సి కార్పొరేషన్ ద్వారా పాడి గేదెల పథకానికి ఆన్ లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లా షెడ్యూల్డ్ కులల సేవా సహకార అభివృద్ధి సంఘం లి,,మహబూబాబాద్ జిల్లా ద్వారా 202526 సం. నకు పాడి గేదెల పథకానికి గాను ఆన్ లైన్ దరఖాస్తు తేది 08042026 ముగియడంతో ప్రభుత్వం గడువు తేదిని 16042026 వరకు పొడిగించనైనదని కార్యనిర్వాహక సంచాలకులు కె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున, అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ / యువకులు సంబంధిత కుల ధృవీకరణ పత్రం (తెలంగాణా ఏర్పడిన తరవాత జారీ చేసింది), ఆదాయ ధృవీకరణ ప(తం (మీసేవ ద్వారా జారీ చేసింది), ఆదార్ కార్డు, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, సదరం సర్టిఫికేట్ (వికలాంగుల కోసం) మరియు పట్టాదారు పాసు పుస్తకం (కనీసం 0.10 గుంటలు), తదితర ధృవ ప(త్రాలతో 16042026 వరకు ఆన్ లైన్ (www.tgobmms.cgg.gov.in) నందు దరఖాస్తు చేసుకొని, వెంటనే అట్టి ఆన్లైన్ దరఖాస్తుకు సంబంధిత ధృవ పత్రాలను జత పరిచి (హార్డ్ కాపీ), గ్రామీణ ప్రాంతం వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయము నందు మరియు పట్టణ ప్రాంతం వారు సంబంధిత మునిసిపాలిటి కార్యాలయము నందు సమర్పించవలసినదిగా తెలియపరచనైనది.ఈ పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు (02) పాడి గేదెలను అందజేయడం జరుగుతుందని,ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

# ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు పోషన్ పక్వాడ కార్యక్రమం

* **రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క).**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభించి, అంగన్వాడి టీచర్లకు (1313) మొబైల్ ఫోన్లు పంపిణీ, పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు డాక్టర్ భూక్య మురళి నాయక్, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మున్సిపల్ చైర్పర్సన్ జ్యోతి లతో కలిసి ప్రారంభించిన, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క),గురువారం మహబూబాబాద్ పట్టణంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ను ప్రారంభించారు, వృద్ధుల సంరక్షకులకు జీవనశైలి మెరుగుపడడం కోసం ఉపయోగపడుతుందని వారి యొక్క ఒంటరితనాన్ని పోయి సంతోషంగా ఉండటం కోసం రూపొందించబడిన ఈ కేంద్రం ద్వారా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని వయోవృద్ధులు వివిధ క్రీడలలో పాల్గొనవచ్చని, తద్వారా మానసిక ప్రశాంతతబి ఉల్లాసంగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 12 లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని, వారిని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వదిలేయడం తగదని సూచించారు. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కేంద్రంలో టీవీ, దినపత్రికలు మ్యాగజీన్, పాటల పోటీలో క్యారమ్స్, చెస్, మొదలగైన ఆటలు అందుబాటులో ఉంటాయని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కేంద్రంలో ప్రథమ చికిత్స ఆరోగ్య సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి వారానికి ఒకసారి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ఉంటారని, వారి యొక్క ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మల్టీ గ్రైన్ ఆల్ఫా ఆహార పదార్థాలతో అందించడం జరుగుతుందని తెలిపారు,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా వయవృద్ధులు గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లలకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు (1368) మొబైల్ ఫోన్ల పంపిణీ చేయడం జరిగిందని తద్వారా క్షేత్రస్థాయిలో డిజిటల్ విధానంలో ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు పౌష్టిక ఆహారం, స్థితిగతులు ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా అప్లోడ్ చేయడం పారదర్శకంగా పాలన కొనసాగుతుందన్నారు, పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని మహబూబాబాద్ కేంద్రంగా గురువారం నుండి ప్రారంభించారు, గర్భిణీలు,పాలిచ్చే తల్లులు,చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం లక్ష్యమని, ఈ కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని శాసనసభలో వృద్ధుల సంక్షేమ చట్టం ప్రవేశపెట్టి అమలుపరచినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,మహబూబాబాద్ లో డే కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, రిటైర్డ్ ఉద్యోగులు వయవృద్ధుల కోసం ఇక్కడ వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సభను ఉద్దేశించి ప్రసంగించి అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు ముందుకు సాగుతారని అన్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె. అనిల్ కుమార్, జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత, సిడిపిఓలు శిరీష, సంబంధిత విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 11 రోజుల్లో రెట్టింపు డబ్బు వస్తుందని నమ్మించి.. రూ.12.31 కోట్లు టోకరా!

పుణె, ఏప్రిల్ 10: పుణెలో 75 ఏళ్ల వైద్యుడు సైబర్ మోసగాళ్ల చేతిలో భారీ దోపిడీకి గురయ్యారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా 11 రోజుల్లో డబ్బు రెట్టింపు అవుతుందంటూ దుండగులు నమ్మించి అతడి నుంచి ఏకంగా రూ.12.31 కోట్లు దోచేశారు. చివరికి మోసపోయానని(Cyber crime) తెలుసుకున్న ఆ వృద్ధుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. "మీ వద్ద ఉన్న డబ్బుని పెట్టుబడి పెడితే 11 రోజుల్లో రూ.54 కోట్లు చేస్తామని సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుడిని నమ్మించారు. డబ్బుపై అత్యాశతో వారు పంపిన వివిధ బ్యాంకు ఖాతాలకు అతడు ఎనిమిది విడతలుగా డబ్బును బదిలీ చేశారు. ఇదంతా జనవరిలోనే మొదలైంది. 'మీరు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఆ మొత్తానికి రెండితల లాభాలు వస్తాయి' అంటూ ఓ గుర్తు తెలియని నంబరు నుంచి బాధితుడి మొబైల్ ఫోన్‌కి ఈ ఏడాది జనవరిలోనే మెసేజ్ వచ్చింది. దీనిపై బాధితుడు ఆసక్తి చూపడంతో సైబర్ నేరగాళ్లు అతడిని 'VIP Stock 24' అనే వాట్సప్ గ్రూప్‌లో చేర్చారు.



నిందితులంతా స్టాక్ మార్కెట్లో(Stock market) పెట్టుబడి పెడితే ఎలాంటి లాభాలు పొందొచ్చనే అంశాలపై ఆ గ్రూప్‌లో చర్చించేవారు. దీంతో బాధితుడికి వారిపై నమ్మకం కుదిరింది. వారు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తే కేవలం 11 రోజుల్లోనే డబ్బు రెట్టింపు అవుతుందని పదే పదే చెప్పేవారు" అని పోలీసులు పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్ల వలకు చిక్కిన ఆ వైద్యుడికి అంతర్జాతీయ ట్రేడింగ్ కంపెనీని పోలిన ఓ మోసపూరిత యాప్ లింక్‌ని పంపించి అందులో వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో బాధితుడు మార్చి 7 నుంచి 18 మధ్య మొత్తంగా రూ.12.31 కోట్లు బదిలీ చేశాడు. నకిలీ యాప్‌లో లాభాలు వచ్చాయంటూ, నగదు రెట్టింపు అయిందంటూ భ్రమలు కల్పించారు. మరింత పెట్టుబడి పెట్టాలంటూ వారు బలవంతం చేశారు. బాధితుడు సంకోచించడంతో అకౌంట్‌లో ఉన్న నగదును సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# నాటి నక్సల్ ప్రాంతంలో 'నీట్' జెండా.. ఉపాధ్యాయుడి చొరవతో అద్భుతం!

పాట్నా/రాణిగంజ్: ఒకప్పుడు తుపాకుల మోత, నక్సల్ కార్యకలాపాలతో భయం గుప్పిట్లో బతికిన ప్రాంతం నేడు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. సూర్యాస్తమయమైతే చాలు ప్రజలు ఇళ్లకే పరిమితమైన ఆ ప్రాంతం నుంచి నేడు వైద్యులు పుట్టుకొస్తున్నారు. ఒక తరం తలరాతనే మార్చేసే ఈ గొప్ప పరివర్తనకు దేవ్ ప్రకాశ్ అనే ఓ ఉపాధ్యాయుడి కృషి, పట్టుదలే కారణం. విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందించి ఎంతో మందిని ఎంబీబీఎస్ వైపు ప్రోత్సహిస్తూ మార్గదర్శిగా నిలుస్తున్నారు బిహార్‌కు చెందిన దేవ్ ప్రకాశ్. ఆయన సారథ్యంలోనే విద్యార్థులు ఆల్ఇండియా ర్యాంకులతో సత్తా చాటుతుండటం విశేషం. బోధనపై ఉన్న అమితమైన ఆసక్తితో దేవ్ ప్రకాశ్ డీఆర్డీవో వంటి ప్రఖ్యాత సంస్థల నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినా వదులుకున్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయం (2020)లో ఆయన తన స్వస్థలం రాణిగంజ్‌కు వెళ్లారు. అక్కడ పిల్లలు చదువు మానేసి చిన్నతనంలోనే పనులకు వెళ్లడంతో కలత చెందారు. ఇంటింటికి వెళ్లి చదువుపై అవగాహన కల్పించి పిల్లల్ని విద్య వైపు నడిపించారు. నీట్ వంటి కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. దేవ్ ప్రకాశ్ కృషి ఫలితంగా ఏడుగురు విద్యార్థులు వైద్యులుగా మారారు. ఇందులో ఐదుగురు అమ్మాయిలే ఉండటం విశేషం. చీకటి కమ్ముకున్న తమ జీవితాలకు వెలుగు చూపారంటూ ఆ విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. "ఖరీదైన కోచింగ్ సెంటర్లతో విజయం వరించదు. సరైన బోధన, స్థిరమైన ఏకాగ్రత, లక్ష్యంతోనే గెలుపు సాధ్యమవుతుంది. మరిన్ని గ్రామాల్లోని విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా" అని దేవ్ ప్రకాశ్ చెప్పుకొచ్చారు.

## పురుషులనూ అనుమతించని

# ఆలయాలున్నాయ్: 'శబరిమల' అంశంపై కేంద్రం


న్యూఢిల్లీ, మార్చి 10 : కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10 50 ఏళ్ల వయసు కలిగిన మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారమే కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. అందువల్ల, ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శబరిమలలో 10–50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని



ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

# ఇంధన కొరత ఆందోళనలు.. గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: అమెరికా ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్ పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గురు, శుక్రవారాల్లో హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌లో పర్యటించనున్నట్లు సంబంధిత శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయన పర్యటనకు సంబంధించి స్పష్టమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. కాగా.. ఇరాన్ ప్రతీకార దాడులకు గురైన గల్ఫ్ దేశాల్లో ఖతార్ కూడా ఒకటి. ఈ దాడుల నేపథ్యంలో ఎల్ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజాగా కాల్పుల విరమణ



ఒప్పందం కుదరడంతో ఉత్పత్తులను పునఃప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా పరిమిత కార్యకలాపాలే నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హర్దీప్ సింగ్ పురీ ఖతార్‌కు వెళ్తుండటం ప్రాధాన్యం సంతరించుకొంది.

**యూఏఈకి జైశంకర్..**

భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 11 12 తేదీల్లో జై శంకర్ పర్యటన ఉండనున్నట్లు సంబంధిత శాఖ పేర్కొంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో.. భారత్‌లో ఇటీవల ఎల్ఎన్‌జీ కొరతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. అయితే, కేంద్రం ఈ ఆందోళనలను కొట్టిపారేసింది. దేశంలో తగినన్ని నిల్వలు ఉన్నాయని, కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారాలు నిరాధారమైనవని స్పష్టం చేసింది.

## ఉత్కంఠకు తెర..

# బారామతిలో సునేత్రా పవార్‌కు మార్గం సుగమం


మహారాష్ట్రలో బారామతి అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికపై కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పోటీ నుంచి వైదొలగనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. దీంతో డిప్యూటీ సీఎం సునేత్రా పవార్ ఏకగ్రీవ ఎన్నికకు మార్గం సుగమమైంది. అజిత్ పవార్ పై ఉన్న గౌరవంతోనే తమ అభ్యర్థిని పోటీ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్



వెల్లడించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సహా ఇతర సీనియర్ నేతలు కాంగ్రెస్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది జనవరి 28న మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన బారామతి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏప్రిల్ 23న అక్కడ పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే, పోటీ నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలగనున్నట్లు ప్రకటించడంతో పవార్‌లకు కంచుకోటగా ఉన్న బారామతి నుంచి సునేత్రా పవార్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

# కర్ణాటకలో ట్రెక్కింగ్.. మరో కేరళ అమ్మాయి మిస్సింగ్

కర్ణాటక కొండల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన కేరళకు చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మొన్నటికి మొన్న కేరళకు చెందిన ఓ టెకీ కర్ణాటక కొండల్లో ట్రెక్కింగ్‌కి వెళ్లి మిస్ కాగా.. పోలీసులు జరిపిన సెర్చ్ ఆపరేషన్‌తో నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ లభ్యమైంది. మళ్లీ అలాంటి ఘటనే చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక కర్ణాటకలోని చంద్రద్రోణ హిల్స్ పైకి ఏప్రిల్ 7న దాదాపు 40 మంది



కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లింది. అదేరోజు సాయంత్రం బృందం నుంచి ఆ బాలిక దారి తప్పిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో మరుసటి రోజు తమకు ఫిర్యాదు చేశారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. "వెంటనే బాలిక కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాం. కొండలపై తాళ్ల సాయంతో వెతకడం ప్రారంభించాం. రాత్రి వేళల్లో డ్రోన్లతోనూ ఆమె కదలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాం. కేరళ పోలీసులు కూడా ఈ దర్యాప్తులో భాగం అయ్యారు" అని కర్ణాటక పోలీసులు పేర్కొన్నారు. కేరళకు చెందిన శరణ్య అనే యువతి ఏప్రిల్ 2న కర్ణాటకలో ట్రెక్కింగ్‌కు వెళ్లి తప్పిపోయిన విషయం తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం భారీ సెర్చ్ ఆపరేషన్‌తో ఎట్టకేలకు నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ లభ్యమైంది.

# ఒత్తిడి పెట్టకుంటే ఏమీ అర్థం కాదు: ట్రంప్

ఇస్లామాబాద్: నాటో తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. "మనల్ని నిరాశపరిచే నాటో కూటమితో సహా మిత్ర దేశాలకు.. ఒత్తిడి పెట్టకుంటే సమస్యలేమీ అర్థం కావు" అని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అయితే ఇరాన్‌పై యుద్ధానికి, హర్మూజ్ జలసంధి వద్ద సాయానికి కలిసి రానందుకు ఇప్పటికే నాటో దేశాలను ట్రంప్ విమర్శిస్తున్న సంగతి తెలిసిందే.



**చర్చలకు ఏర్పాట్లు..**

కాల్పుల విరమణకు సంబంధించి అమెరికాఇరాన్ (Iran)లు చర్చలకు సిద్ధమయ్యాయి. ఇందుకు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా నిలువనుంది. ఇందుకోసం భారీ భద్రత ఏర్పాటు చేసినట్లు పాక్ పీఎంవో పేర్కొంది. చర్చల కోసం వచ్చే బృందాలకు పూర్తి సహకారం అందిస్తామని ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. గురువారం రాత్రి ఇరు దేశాల ప్రతినిధి బృందాలు ఇస్లామాబాద్‌కు చేరుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు దిగడం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ స్పష్టం చేశారు. ఇటువంటి పరిణామాలు చర్చలను అర్థరహితం చేస్తాయన్నారు.

# ఆంక్షలతో విజయం సాధించలేరు ఇరాన్ అణు ఇంధన సంస్థ చీఫ్

టెహ్రాన్/జెరూసలేం: ఇరాన్ (Iran) అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అన్నారు. అమెరికాతో జరిపే ఎటువంటి కాల్పుల విరమణ చర్చల్లోనూ తమ హక్కుల పరిరక్షణే అత్యవసర అంశంగా ఉండాలని చెప్పారు. తమపై ఆంక్షలు విధించి శత్రువులు విజయం సాధించలేరన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో యురేనియం శుద్ధి అంశాన్ని అమెరికా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇరాన్ అణు ఇంధన సంస్థ చీఫ్ ఎస్లామీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు, ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఇరాన్ మధ్య శుక్రవారం చర్చలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్న విషయం తెలిసిందే.


**మౌలిక సదుపాయాలను దెబ్బతీస్తాం..**

లెబనాన్‌ను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మరోసారి హెచ్చరించారు. తమను లక్ష్యంగా



చేసుకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదన్నారు. లెబనాన్‌లోని మౌలిక సదుపాయాలను దెబ్బతీస్తామన్నారు. రాజధాని బీరుట్‌లో జరిపిన దాడుల్లో హెజ్‌బొల్లా కీలక నేత నయీమ్ ఖాసిం సన్నిహితుడు అలీ యూసఫ్ హతమైనట్లు నెతన్యాహు వెల్లడించారు. ఆయన ఖాసింకు సమీప బంధువు అని సమాచారం. అయితే, దీనిపై హెజ్‌బొల్లా నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

# డయాబెటిక్‌తో దంత సమస్యలు వస్తాయా?



దంతాలపై డయాబెటిక్ తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు డయాబెటిక్‌కు, దంతాలకు ఉన్న సంబంధం ఏంటి? ఎలాంటి సమస్యలు వస్తాయో తెలుసుకుందాం. డయాబెటిక్‌కు, దంతాల ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. షుగర్ ఉన్న పేషెంట్ రక్తంలో చక్కెర స్థాయులు అధికంగా ఉండటం. ఇది రెండు రకాలు. మొదటిది.. టైప్-1 డయాబెటిస్. రెండోది.. టైప్-2 డయాబెటిస్. ఎక్కువమందిలో కనిపించేది రెండో రకమే. గర్భిణులలోనూ కొన్నిసార్లు హార్మోన్ మార్పుల వల్ల చక్కెర నిల్వలు పెరిగే అవకాశం ఉంది. కానీ కొద్దిరోజులకే నియంత్రణలోకి వస్తుంది.

టైప్1 డయాబెటిక్ రోగుల్లో జన్యుపరంగానే ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడే బాలల్లో అయితే.. 20 ఏండ్ల లోపే దంతాలు ఊడిపోవడం మొదలవుతుంది. కనీసం నాలుగు మూల దంతాలు ఊడిపోతే.. దాన్ని టైప్1 డయాబెటిస్‌గా పరిగణిస్తారు. టైప్2లో ఇన్సులిన్ ఉత్పత్తి జరిగినా, షుగర్‌ను నియంత్రించేంత స్థాయిలో ఉండదు. టైప్1, టైప్2.. రెండు డయాబెటిక్ రకాలూ దంతాలపై ఒకేలా ప్రభావం చూపుతాయి. ఒకేరకమైన ఇబ్బందిని కలిగిస్తాయి. గర్భిణులలో హార్మోన్ మార్పుల వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం లేకపోలేదు. అయితే, ప్రసవం తరువాత 90 శాతం మందిలో షుగర్ మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. మధుమేహం తీవ్రంగా ఉన్న సమయంలో సాధారణ రోగుల్లో కనిపించే చిగుళ్లు, దంతాల సమస్యలే.. గర్భిణులనూ ఇబ్బంది పెడతాయి. డయాబెటిక్ పేషెంట్లలో ఇమ్యూనిటీ పడిపోతుంది. హానికర బ్యాక్టీరియాతో పోరాడే సత్తువ సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆ బ్యాక్టీరియా నోటిపై ప్రభావం చూపుతుంది. గాయాలు ఓ పట్టాన మానిపోవు. అక్కడితో ఆగకుండా, ఆ బ్యాక్టీరియా కక్షగట్టినట్టు షుగర్ స్థాయులను పెంచుతుంది. దీనివల్ల నోటి ఇన్ఫెక్షన్లు అధికమవుతాయి. అంటే.. నోటిలో ఇన్ఫెక్షన్లు పెరిగితే మధుమేహ తీవ్రత పెరుగుతుంది. మధుమేహ తీవ్రత పెరిగితే నోటిలో ఇన్ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. ఈ బంధానికి అడ్డుకట్ట వేయాలి. డయాబెటిస్ రోగులను ప్రధానంగా ఆరురకాల దంత సమస్యలు వేధిస్తాయి. పిప్పిపళ్లు, చిగుళ్ల సమస్య, పెరియో డాంటైటిస్, క్రష్,. డ్రై మౌత్ నోటి దుర్వాసన.

### పిప్పిపళ్లు

మనం తీసుకునే ఆహారంలో ఉన్న చక్కెర, పిండిపదార్థాలకు నోటిలోని బ్యాక్టీరియా వేగంగా స్పందిస్తుంది. దీనివల్ల దంతాలపై సన్నని గార ఏర్పడుతుంది. దీనిలోని రసాయనాలు పంటి పైభాగంలోని ఎనామిల్‌ను, డెంటిన్‌ను దెబ్బతిస్తాయి. దీనివల్ల పిప్పిపళ్లు పుట్టుకొస్తాయి. బ్లడ్ షుగర్ ఎంత పెరిగితే అంత ఎక్కువగా గార పేరుకుపోతుంది. రసాయనాల దాడి అధికమవుతుంది. నోరంతా పిప్పి విస్తరించవచ్చు.

### చిగుళ్ల వ్యాధులు

వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో హానికర బ్యాక్టీరియా ప్రాబల్యం పెరుగుతుంది. దీనివల్ల గార మరింత గట్టిపడుతుంది. క్రిమి కీటకాలకు చిరునామాగా మారుతుంది. అంతేకాకుండా.. చిగుళ్లనూ దెబ్బతీస్తుంది. దీంతో చిగుళ్లు ఉబ్బడం, రక్తం కారడం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ సమస్యను 'జింజివైటిస్' అంటారు. దీన్ని చిగుళ్ల వ్యాధికి మొదటి దశగా పరిగణిస్తారు.

### పెరియోడాంటైటిస్

జింజివైటిస్‌కు సకాలంలో చికిత్స చేయకపోతే.. పంటికింది ఎముకను క్రమంగా తినేయడం మొదలుపెడుతుంది. దీంతో పన్ను వదులైపోతుంది. ఓ దశలో ఊడిపోతుంది. దీన్నే వైద్య పరిభాషలో 'పెరియోడాంటైటిస్' అంటారు. ఈ సమస్య సాధారణ వ్యక్తులలో కంటే డయాబెటిక్ రోగుల్లో మూడురెట్లు అధికం. డయాబెటిక్ రోగుల్లో ఇట్టే దంతాలు కదులుతాయి. అంతే కాకుండా చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి చీము రావడం తదితర ఇబ్బందులూ వెంటాడతాయి.

### క్రష్

నాలుకపై ఫంగల్ ఇన్ఫెక్షన్ రావడాన్నే 'క్రష్' అంటారు. ఈ ప్రభావంతో నాలుకపై తెలుపు లేదా ఎరుపు రంగు మచ్చలాంటిది ఏర్పడుతుంది. ఇది కొంతమేర నొప్పిని కలిగిస్తుంది. డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య మరీ అధికం.

### డ్రై మౌత్

నోట్లో లాలాజలం తగ్గినప్పుడు నోరు పొడిబారుతుంది. దీన్నే 'డ్రై మౌత్' అంటారు. లాలాజలం ఎప్పటికప్పుడు నోటిని శుభ్రపరుస్తుంది. రసాయనాలు మరీ పెరిగిపోకుండా, మరీ తగ్గిపోకుండా సమతౌల్యం చేస్తుంది. లాలాజలం తగ్గడం వల్ల రసాయన స్థాయులు అధికమై నోరు అపరిశుభ్రంగా మారుతుంది. దీంతో పిప్పిపళ్లు తదితర సమస్యలు వెంటాడుతాయి.

### నోటి దుర్వాసన

నోటి దుర్వాసన వేధిస్తుంది. కాబట్టి మధుమేహం విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటారో, దంత సమస్యల విషయం లోనూ అన్ని వైద్యపరమైన చర్యలు తీసుకోవాలి.

### మౌత్‌వాష్..

ఏదైనా తిన్న తర్వాత మంచినీళ్లతో పుక్కిలించి ఉమ్మడం మంచి అలవాటు. దీనికితోడు.. ముడి ఉప్పును గోరువెచ్చని నీటిలో కలిపి రోజూ నోటిని శుభ్రపర్చు కోవాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్లు కొంతమేర నియంత్రణలో ఉంటాయి. వైద్యుల సలహాతో మార్కెట్‌లో లభించే నాణ్యమైన మౌత్‌వాష్‌లనూ వాడవచ్చు. రసాయనాల ప్రభావం లేనివైతే మరీ మంచిది. దీనివల్ల సగానికి సగం హానికర బ్యాక్టీరియాను తొలిదశలోనే వదిలించుకోవచ్చు.



### నివారణ చర్యలు ఇలా..

మధుమేహం నియంత్రణలో ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలి. ఉదయం లేవగానే ఒకసారి.. రాత్రి పడుకునే ముందు మరోసారి బ్రష్ చేయాలి. రాత్రి బ్రష్ చేసిన తర్వాత ఎలాంటి ఆహారమూ తీసుకోరాదు. సున్నితంగా ఉండే బ్రష్‌లనే ఎంచుకోవాలి. మరీ బలంగా రుద్దినట్టు కాకుండా, ఒక పద్ధతి ప్రకారం తోముకోవాలి. కనీసం రెండు నిమిషాలపాటు బ్రష్ చేయాలి. మూడు నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలి. అవసరమైతే, రోజు ఫ్లాసింగ్ చేయాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. సాధారణ ఆరోగ్యవంతులు ఏడాదికోసారి నిపుణులతో దంతాలను శుభ్రం చేయించుకోవాలి. డయాబెటిస్ ఉన్నవారు ఆ విషయాన్ని దంత వైద్యులకు తప్పక చెప్పాలి. నోటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. ధూమపానం కూడా దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి, ఆ





# మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ ఉందా?



శరీర ఆరోగ్యానికి తగినంతగా ఫైబర్‌తో కూడిన ఆహారం తీసుకోవడం కీలకం. జీర్ణక్రియ సాఫీగా సాగడం నుంచి కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవెల్స్ కంట్రోల్ వరకు ఫైబర్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయి. మలబద్ధకాన్ని నివారించి ప్రేగుల కదలికలను ప్రేరేపించి జీర్ణక్రియ సజావుగా సాగేలా చూస్తుంది. ఫైబర్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు ఆరోగ్యకర జీవనశైలిని అనుసరిస్తే ఫైబర్ లోపాలను అధిగమించడంతో పాటు శరీర ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చు.

ఆరోగ్యానికి కీలకమైన ఫైబర్‌లో రెండు రకాలుంటాయి. నీటిలో కరిగే సాల్యుబుల్ ఫైబర్ రక్తంలో కొలెస్ట్రాల్ లెవల్స్‌ను, బ్లడ్‌షుగర్ లెవెల్స్‌ను తగ్గిస్తుంది. నీటిలో కరగని ఇన్‌సాల్యుబుల్ ఫైబర్ మలబద్ధకాన్ని నివారించి ప్రేవుల కదలికలను ప్రేరేపిస్తుంది. అయితే మనం ఫైబర్ తగినంతగా తీసుకోవడం లేదని పలు సంకేతాల ద్వారా తెలుసుకోవచ్చు. మలబద్ధకం, గ్యాస్, కడుపుబ్బరం, తిన్న వెంటనే ఆకలివేయడం, నీరసం, నిస్సత్తువ, చర్మం నిర్జీవంగా ఉండటం, తీవ్ర అనారోగ్యాల ముప్పు, అధిక కొలెస్ట్రాల్ లెవెల్స్, మలం గట్టిపడటం, విపరీతంగా బరువు పెరగడం లేదా తగ్గడం.. ఈ లక్షణాలు కనిపిస్తే మీరు తినే ఫుడ్‌లో ఫైబర్ శాతం తగ్గినట్లే.




## ట్రూ కాలర్‌లో నయా ఫీచర్..

# ఫ్రాడ్ కాల్స్‌కు చెక్

## ఫ్రాడ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు నయా ఫీచర్

గుర్తు తెలియని నంబర్ల ఎన్నో ఫ్రాడ్ కాల్స్ వస్తుంటాయి. సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో ఏఐ సాయంతో వ్యక్తుల వాయిస్‌ను క్లోన్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారు. మోసపోయిన విషయం బాధితులకు కూడా కొన్నిసార్లు ఆలస్యంగా తెలుస్తోంది. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు ట్రూకాలర్ కొత్త ఫీచర్ తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తించేందుకు కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఏదైనా కాల్ వచ్చినప్పుడు ఆ వాయిస్ ఏఐ సాయంతో జనరేట్ చేసినదా? కాదా? అనేది కొన్ని క్షణాల్లో ట్రూకాలర్‌లోని ఈ ఫీచర్ చెప్పేస్తుంది. అందుకోసం కొన్ని క్షణాల పాటు ఆ వాయిస్‌ను రికార్డు చేసి అనలైజ్ చేస్తుంది. ఇందుకోసం తమ సొంత ఏఐ మోడల్‌ను వాడుతున్నట్లు ట్రూకాలర్ తెలిపింది. సోషల్‌మీడియాలోని వీడియోలతో పాటు కొందరు వ్యక్తుల వాయిస్‌ను ఉపయోగించినట్టు ట్రూకాలర్ తెలిపింది. ఏఐ స్కామ్ కాల్స్‌ను గుర్తించేందుకు ట్రూకాలర్‌ను డిఫాల్ట్ కాలర్ యాప్‌గా సెట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై ఏదైనా అనుమానాస్పద కాల్ వస్తే స్టార్ట్ డిటెక్షన్‌పై క్లిక్ చేస్తే కాల్‌ను రికార్డు చేసికొన్ని వెంటనే దాన్ని అనలైజ్ చేస్తుంది. ఫలితాన్ని నోటిఫికేషన్ రూపంలో తెలియజేస్తుంది. తొలుత అమెరికాలోని ఆండ్రాయిడ్ ప్రీమియం యూజర్లకు ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ తెలిపింది. రాబోయే నెలల్లో భారత్ సహా ఇతర మార్కెట్లకు ఈ సదుపాయం తీసుకొస్తామని కంపెనీ తెలిపింది.

## భారత్‌లో మెర్సిడెస్ బెంజ్ అమ్మకాల రికార్డ్...

### విశాఖలోనూ కొత్త ఔట్‌లెట్



**న్యూఢిల్లీ:** ప్రముఖ జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో సరికొత్త ఆల్ టైమ్ రికార్డును సృష్టించింది. ఎన్నడూ లేనంతగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 19,363 యూనిట్లను విక్రయించి, గత ఏడాదితో పోలిస్తే 2.29 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 18,928 కార్లను విక్రయించింది. ఇదే సమయంలో, 2026 జనవరి-మార్చి త్రైమాసికంలో కూడా 7.45 శాతం వృద్ధితో 5,131 యూనిట్లను విక్రయించినట్లు గురువారం ప్రకటించింది.

ఈ అమ్మకాల వృద్ధికి ప్రధాన కారణం టాప్-ఎండ్, కోర్ లగ్జరీ సెగ్మెంట్లలో బలమైన డిమాండ్ ఉండటమేనని కంపెనీ వెల్లడించింది. ముఖ్యంగా, టాప్-ఎండ్ లగ్జరీ సెగ్మెంట్‌లో అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంలో 16 శాతం, మార్చి త్రైమాసికంలో 25 శాతం పెరిగాయి. ఎస్-క్లాస్, మెర్సిడెస్-మేబ్యాక్ శ్రేణి, ఈక్యూఎస్ ఎస్ యూవీ, ఏఎంజీ పోర్ట్‌ఫోలియో వంటి మోడళ్లు ఈ విభాగంలో ఉన్నాయి. కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈ సెగ్మెంట్ వాటా 27 శాతంగా ఉండటం విశేషం. ఏఎంజీ జీ 63 వంటి కొన్ని మోడళ్ల కోసం ప్రస్తుతం 4 నెలల నుంచి ఏడాది వరకు వెయిటింగ్ పీరియడ్ ఉంది.


కంపెనీ 'కోర్' సెగ్మెంట్‌లోని సీ-క్లాస్, ఈ-క్లాస్ ఎల్‌డబ్ల్యూబీ సెడాన్‌లు, జీఎల్ సీ, జీఎల్ఈ ఎస్‌యూవీలు కూడా అమ్మకాల్లో కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా, ఈ-క్లాస్ లాంగ్-వీల్‌బేస్ మోడల్ భారతదేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న లగ్జరీ కారుగా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అయితే, మార్కెట్లో తక్కువ ధర ఆఫర్లతో పోటీ పెరగడంతో 'ఎంట్రీ లగ్జరీ' సెగ్మెంట్ అమ్మకాలు 18 శాతం తగ్గాయని కంపెనీ తెలిపింది. కేవలం అమ్మకాల సంఖ్య పెంచుకోవడం కాకుండా, అత్యాధునిక ఫీచర్లతో కూడిన ఉత్పత్తులను అందించడంపైనే తమ దృష్టి అని స్పష్టం చేసింది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) అమ్మకాల్లోనూ మెర్సిడెస్ బెంజ్ మంచి వృద్ధిని కనబరిచింది. రూ.1.4 కోట్లకు పైగా ధర ఉన్న టాప్-ఎండ్ ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఏకంగా 85 శాతం పెరిగాయి. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా, ఏప్రిల్ 24న సీఎల్ఏ ఎలక్ట్రిక్ వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేయనుంది.

#### ఏపీలోనూ అవుట్ లెట్

'గో టు కస్టమర్' వ్యూహంతో దేశవ్యాప్తంగా తన రిటైల్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు కంపెనీ సిద్ధమైంది. 2026లో 20కి పైగా కొత్త లగ్జరీ ఔట్‌లెట్లను ప్రారంభించనుంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, అలాగే వారణాసి వంటి కొత్త నగరాల్లోకి ప్రవేశించనుంది. ఫ్రాంచైజ్ భాగస్వాముల ద్వారా రాబోయే రెండేళ్లలో రూ.450 కోట్లకు పైగా పెట్టుబడితో ఈ విస్తరణ పనులు చేపట్టనున్నట్లు కంపెనీ వివరించింది.

## ఐదు రోజుల జోరుకు బ్రేక్...

### భారీ నష్టాల్లో మార్కెట్లు




**ముంబై:** గత ఐదు రోజులుగా లాభాల జోరు చూపిన దేశీయ స్టాక్ మార్కెట్లకు గురువారం బ్రేక్ పడింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలు, అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణపై నెలకొన్న అనిశ్చితి ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపగా, సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి.

వివరాల్లోకి వెళితే, సెన్సెక్స్ 931.25 పాయింట్లు పతనమై 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, లార్సెన్ అండ్ టుబ్రో వంటి దిగ్గజ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి.

ప్రధాన సూచీలు బలహీనపడినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మాత్రం కొంత నిలకడగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.25 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.20 శాతం చొప్పున స్వల్ప లాభాలతో ముగియడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, బ్యాంకింగ్ షేర్లు మార్కెట్‌ను కిందికి లాగాయి. మరోవైపు, మెటల్ స్టాక్స్ కొంత మద్దతునిచ్చి టాప్ గెయినర్‌గా నిలిచింది.

అమెరికా పట్ల తీవ్ర అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘలీబాఫ్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లలో ఆందోళన పెంచాయి. కాల్పుల విరమణ ఒప్పందాలను అమెరికా పదేపదే ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ పరిణామాలతో ఐదు రోజులుగా కొనసాగుతున్న రూపాయి ర్యాలీకి కూడా బ్రేక్ పడింది. టెక్నికల్ పరంగా నిఫ్టీ 23,600 స్థాయికి దిగువకు పడిపోతే మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి ఫస్ట్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ వచ్చేసింది



**న్యూఢిల్లీ:** ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి ప్రవేశించింది. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట తన తొలి ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌ను గురువారం విడుదల చేసింది. సిటీం ఎలక్ట్రిక్ మొబిలిటీ బ్రాండ్‌పై దీన్ని తీసుకొచ్చింది. ఈ మోటార్ సైకిల్ ధరను రూ.2.79 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్ ధర) నిర్ణయించింది. బ్యాటరీ యాజ్ ఏ సర్వీసెస్ విధానంలో అయితే రూ.1.99 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 10 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. మే నెల నుంచి వాహనాన్ని డెలివరీ చేయనున్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్లయింగ్ ఫ్లీ సీ6లో 3.91 కిలోవాట్ అవర్ బ్యాటరీని ఇచ్చారు. ఇందులో 15.4 మోటార్‌ను అమర్చారు. దీని గరిష్ఠ వేగం గంటకు 115 కిలోమీటర్లు. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.7 సెకన్ల వ్యవధిలో అందుకుంటుందని రాయల్ ఎన్‌ఫీల్డ్ వెల్లడించింది. ఒకసారి ఛార్జ్ చేస్తే 154 కిలోమీటర్లు (ఐడీసీ రేంజ్) ప్రయాణించవచ్చని చెబుతోంది. కేవలం 65 నిమిషాల్లో 20 శాతం నుంచి 80 శాతం బ్యాటరీని రీఛార్జి చేయొచ్చని పేర్కొంది.

ముఖ్యంగా నగరవాసులే లక్ష్యంగా ఈ మోటార్ సైకిల్‌ను రాయల్ ఎన్‌ఫీల్డ్ తీసుకొచ్చింది. ఫ్రేమ్ మొత్తం బయటికి కనిపించేలా కాంపాక్ట్ డిజైన్‌తో రూపొందించారు. ఫ్లోటింగ్ సీటు, డిటాచ్‌బుల్ పిల్లియన్ సీటు ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌లైట్లు, గూగుల్ సాయంతో పనిచేసే ఆన్‌బోర్డ్ నావిగేషన్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, కార్నరింగ్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఉన్నాయి. స్పోర్ట్, ఇండివిడ్యువల్ మోడ్‌లు ఉన్నాయి. ఈ మోటార్ సైకిల్ బరువు 124 కిలోలు. రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి వచ్చిన అతి తక్కువ బరువు గల మోటార్ సైకిల్ ఇదే కావడం గమనార్హం.

=====



## ఓటమి అంచు నుంచి

# లక్నో థ్రిల్లింగ్ విక్టరీ

### ముకుల్ చౌదరి సంచలన బ్యాటింగ్...



**కోల్‌కతా:** ఐపీఎల్ 2026 సీజన్‌లో మరో ఉత్కంఠభరితమైన మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఓటమి ఖాయం అనుకున్న మ్యాచ్‌లో యువ ఆటగాడు ముకుల్ చౌదరి (54రి నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ 3 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చివరి బంతి వరకు పోరాడిన లక్నో, చిరస్మరణీయ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ ఛేదనలో తడబడింది. మార్ష్ (15), మార్క్రమ్ (22), పంత్ (10) వంటి కీలక బ్యాటర్లు త్వరగా వెనుదిరగడంతో లక్నో కష్టాల్లో పడింది. ఆయుష్ బదోని (54) హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా, అతను కూడా ఔట్ కావడంతో లక్నో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది.

ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన ముకుల్ చౌదరి, మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కోల్‌కతా బౌలర్లపై ఎదురుదాడికి దిగి, కేవలం 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 200.00 స్ట్రైక్ రేట్‌తో అజేయంగా 54 పరుగులు చేశాడు. చివరి ఓవర్లో విజయానికి 14 పరుగులు అవసరం కాగా, వైభవ్ అరోరా బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాది స్కోరును సమం చేశాడు. చివరి బంతికి సింగిల్ తీసి జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే (41), అంగ్‌క్రిష్ రఘువంశీ (45) రాణించగా, చివర్లో రోవ్‌మన్ పావెల్ (39రి) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అయితే, ముకుల్ చౌదరి అసాధారణ పోరాటంతో కోల్‌కతాకు సొంతగడ్డపై ఓటమి తప్పలేదు.

## బంగ్లా క్రికెట్‌లో కొత్త శకం

### భారత్‌తో సత్సంబంధాల కోసం తమీమ్ ప్రయత్నాలు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో రాజకీయ మార్పులతో పాటు ఆ దేశ క్రికెట్ బోర్డులోనూ పెను మార్పులు సంభవించాయి. కొత్త ప్రధానమంత్రిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టాక, క్రికెట్ కార్యకలాపాలను చక్కదిద్దే బాధ్యతను మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌కు అప్పగించారు.




బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులో నెలకొన్న అస్థిరతను తొలగించేందుకు 11 మంది సభ్యులతో కూడిన అడ్-హాక్ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా తమీమ్ ఇక్బాల్ బాధ్యతలు చేపట్టారు. రాబోయే 90 రోజుల్లోగా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి బోర్డును గాడిలో పెట్టాలని కొత్త యాజమాన్యం నిర్ణయించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సమయంలో భారత్‌లో పర్యటించేందుకు నిరాకరించడంతో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడమే లక్ష్యంగా తమీమ్ అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది చివర్లో ద్వైపాక్షిక సిరీస్ కోసం టీమిండియాను బంగ్లాదేశ్‌కు ఆహ్వానిస్తూ బీసీసీఐకి అధికారిక ప్రతిపాదనలు పంపారు. భారత్‌లో పర్యటించేందుకు కూడా బంగ్లా ఆసక్తి చూపుతోంది.

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భాగంగా భారత్ పర్యటనను విజయవంతం చేయడం ద్వారా రెండు దేశాల మధ్య క్రికెట్ బంధాన్ని మళ్లీ బలోపేతం చేయాలని తమీమ్ భావిస్తున్నారు.

### భారత తొలితరం

## క్రికెటర్ కన్నుమూత..



**న్యూఢిల్లీ:** భారత తొలితరం క్రికెటర్ సీడీ గోపినాథ్ కన్నుమూశాడు. 1952లో టీమిండియా తొలి టెస్టు గెలిచిన పదకొండు మందిలో ఒకడైన గోపిపాథ్ 96 ఏళ్ల వయసులో ప్రాణాలు విడిచాడు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన చెన్నై అడయార్‌లోని తన కూతురి నివాసంలో మరణించాడు. గోపినాథ్ మృతితో భారత క్రికెట్‌లో విషాదం నెలకొంది.

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో నిలకడగా రాణించి భారత జట్టుకు ఎంపికైన గోపినాథ్ విధ్వంసక ఆటగాడిగా పేరొందాడు. వీడ్కోలు అనంతరం ఆయన మేనేజర్, జాతీయ సెలెక్టర్‌గా సేవలందించాడు. భారత దిగ్గజాల్లో ఒకడైన గోపినాథ్ మరణించడంతో చంద్రకాంత్ పటన్‌కార్(95 ఏళ్లు) ప్రస్తుతానికి ప్రాణాలతో ఉన్న అతిపెద్ద వయస్కుడైన క్రికెటర్‌గా గుర్తింపు సాధించాడు.

#### అరంగేట్రంలోనే అదుర్స్

తమిళనాడుకు చెందిన సీడీ గోపినాథ్ 1939, మార్చి 1వ తేదిన జన్మించాడు. 83 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయన ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేసిన అతడు తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ శతకంతో, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులతో మెరిశాడు. దాంతో, భారత్ ఆ మ్యాచ్‌ను డ్రా చేసుకోగలిగింది.

1952లో చెన్నైలో జరిగిన టెస్టులో భారత జట్టు సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలి విజయం నమోదు చేసింది. ఆస్ట్రేలియాతో చివరి మ్యాచ్ ఆడిన గోపినాథ్.. మొత్తంగా ఎనిమిది టెస్టుల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 12 ఇన్నింగ్స్‌ల్లో 242 పరుగులు, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 42.16 సగటుతో 4,259 రన్స్ సాధించాడు.

# క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్..


### తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!

**న్యూఢిల్లీ:** భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీ యు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ చేతులెత్తేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు సైతం మొదటి రౌండ్‌లో ఓటమితో ఇంటిదారి పట్టింది.

చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.

ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఆడలేకపోయిన సింధు ఈ టోర్నీలో మెరుస్తుందనుకుంటే.. వరల్డ్ నంబర్ 2 ధాటికి మొదటి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. రెండు సెట్లలో పోరాడిన తెలుగు తేజాన్ని వాంగ్ జీ యీ 21-18, 21-18తో మట్టికరిపించింది. తొలి రౌండ్‌లో అదరగొట్టిన ప్రణయ్‌ను చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ 21-12, 21-19తో సులువుగా ఓడించాడు. సీనియర్లు విఫలమైన చోట ఇరవై ఏళ్ల ఆయుశ్ ప్రత్యర్థికి దడ పుట్టించాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ ఈసారి 25వ



ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన భారత కుర్రాడు.. 21-16, 21-12తో గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతడికి మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా) ఎదురుపడనున్నాడు. ఆయుష్ సెమీస్ చేరాలంటే జోనాథన్ వ్యూహాలను చిత్తు చేయాల్సిందే.

MOVIE TIME

# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్



### ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

టాకీస్: భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమి అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔెఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను



ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పాలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.

ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు.సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పెళ్లికి ముహూర్తం ఖరారు..



టాకీస్: టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పబోతున్నాడు. ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె కావ్య రెడ్డితో ఆయన వివాహం నిశ్చయమైంది. రీసెంట్‌గా ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ జంటకు సంబంధించిన 'లగ్నపత్రిక' వేడుక ఘనంగా జరిగింది. అత్యంత సన్నిహితులు, బంధువుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం చాలా సాదాసీదాగా, కానీ ఆనందోత్సాహాల మధ్య పూర్తయ్యింది. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సాయి శ్రీనివాస్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి వెంటనే వైరల్ అయ్యాయి. ఫోటోలలో సాయి శ్రీనివాస్ హ్యాపీగా, క్యూట్ లుక్స్‌తో కనిపించగా, కావ్య రెడ్డి కూడా సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకుంది. ఈ జంట చూడముచ్చటగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ లగ్నపత్రిక వేడుకలోనే పెళ్లి ముహూర్తాన్ని ఏప్రిల్ 29గా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పెళ్లి వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహానికి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. సినిమాల విషయానికి వస్తే, సాయి శ్రీనివాస్ 'అల్లుడు శ్రీను' చిత్రంతో ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి, తన స్టైల్, యాక్షన్ సన్నివేశాలతో మాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ఆయన సినిమాలు హిందీ డబ్బింగ్‌లో కూడా మంచి వ్యూస్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందాయి. గత ఏడాది ఆయన చేసిన సినిమాలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రస్తుతం కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా హైందవ అనే అడ్వెంచర్ థ్రిల్లర్‌పై మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రాన్ని దర్శకుడు లుధీర్ బైరెడ్డి తెరకెక్కిస్తున్నారు.

ఒకవైపు కెరీర్‌లో సక్సెస్‌ను ఆస్వాదిస్తూ, మరోవైపు వ్యక్తిగత జీవితంలో కొత్త దశలోకి అడుగుపెడుతున్న సాయి శ్రీనివాస్... తన అభిమానులకు డబుల్ గుడ్ న్యూస్ అందించాడు. త్వరలో పెళ్లి పీటలెక్కబోతున్న ఈ జంటకు అభిమానులు ముందుగానే శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సాయి శ్రీనివాస్ వ్యక్తిగత జీవితంలో సంతోషంగా ఉండాలని, కెరీర్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నారు.

## రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

### రమ్యకృష్ణ కూడా కీ రోల్

టాకీస్: అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల



ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

## డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి


### సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్



**టాకీస్:** కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

## పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

**టాకీస్:** రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.